## చిన్నకథ

# మార్పు!

'నేనో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ని!'

నేనే కాదు నాకున్న ఆరేడుగురు మంచి మిత్ర బృందం కూడా ఆ హోదా తాలూకు అంతస్తులో ఉన్న వారే! లక్షల్లో జీతం. వారమంతా పనుల్లో బిజీగా ఉండే మేము వారాంతపు సెలవు దినాలకు వేలల్లో ఖర్చు పెడ్తాం, అదీ వంతుల వారీగా!

ఒక్క ఆదివారం రోజునే ఎంతలేదన్నా ఇరవైవేల వరకు ఖర్చుపెడ్తాం. స్టార్ హోటల్ ఎ.సి. రూముల్లో విందులు, పొందులు... ఒక్కమాటలో చెప్పాలంటే ఆదివారం అంటేనే మేమంతా మూకుమ్మడిగా స్వర్గానికి వెళ్ళొచ్చే రోజు.

ఆదివారాన్ని ఎంతగా ప్రేమిస్తామో, సోమవారాన్ని అంతకన్నా ద్వేషిస్తాము. ఎందుకంటే మళ్ళీ డ్యూటీలంటూ పరుగులెట్టాలి కనుక. డబ్బుంటే కొండ మీద కోతినేం ఖర్మ ఆ చందమామనైనా దింపగలం అనే ధీమా మాలో. డబ్బుంటే లెక్కలేదు. అది అసలు మాదృష్టిలో డబ్బే కాదు.

''అవసరాలను అవలీలగా తీర్చగలిగే రంగు కాగితాలు!''

ఓ చలి రాత్రి!

ప్రతి ఆదివారం లాగే ఆ వారమూ తిరుపతి కరకంబాడి రోడ్లో ఉన్న ఓ స్టార్ హోటల్లో ఎంజాయ్ చేశాం. తాగినంత తాగాం. పొందు విందు పూర్తయ్యాక ఒకరికి ఒకరం టాటా... బాయ్ బాయ్... గుడ్ నైట్‌లూ చెప్పుకుని ఎవరి బైక్‌ల మీద వారు బయలుదేరాం. లీలామహల్ సెంటర్ చేరుకునే సరికి నా బైక్ ఆగిపోయింది. సమయం రాత్రి 12 గంటలు కావొస్తోంది. లీలామహల్ థియేటర్లో సెకండ్ షో వదిలేశారు. జనమూ కనుమరుగయ్యారు. సన్నగా వర్షం చలితో స్నేహం కలుపుతోంది!

రోడ్ సైడ్‌గా బైక్‌ని ఆపి ఏమైందోనని చెక్ చేశాను. మత్తులో ఏదీ అర్థం కావడం లేదు.

వర్షం పెరిగే సూచనలున్నాయంటూ ఉరుములు, మెరుపులు ముందస్తు హెచ్చరికలు, ఉత్తర్వులు జారీ చేస్తున్నాయి. అక్కడి నుండి నా రూంకు సరిగ్గా కిలోమీటరు దూరం ఉంటుంది. అర్ధరాత్రి కావడం వల్ల ఆటో, రిక్షాల ఆచూకీ కన్పించడం లేదు.

బైక్‌ని లాక్‌చేసి వర్షం నుండి నన్ను నేను రక్షించుకోవడానికి ఆ పక్కనే ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వరండాలోనికి వెళ్లాను. సిగరెట్ వెలిగించుకుని పొగరింగులు వదిలాను. వర్షాన్ని ఎంజాయ్ చేస్తున్నట్లుగా నేను సృష్టించిన పొగరింగులు తడుస్తూ పైకెగురుతున్నాయి. ఇంతలో నేను నిలుచున్న చోటుకు కొద్ది దూరంలో ఎవరిదో మూలుగులాంటి శబ్దం వినిపించింది. ఎవరా అని చుట్టు పక్కల చూస్తున్నంతలో కరెంట్ పోవడంతో చిమ్మచీకటి రాజ్యమేలడానికి సమాయత్తమైంది. జేబులోని పెన్‌టార్చి తీసి వెదకసాగాను. అప్పుడు కన్పించిన దృశ్యం నన్ను కదలించింది.

ఆ షాపింగ్ కాంప్లెక్స్ చివరలో ఓ వ్యక్తి పడున్నాడు. వెళ్లి టార్చ్ వేసి చూసాను. ఓ 70 ఏళ్ళ వరకూ ఉండవచ్చు. చలికి తీవ్రంగా వణుకుతున్నాడు. వంటి మీద చేయివేసి చూసాను. కాలిపోతోంది. శరీరమంతా ఎవరో కుదుపుతున్నట్టుగా గడగడ లాడి పోతున్నాడు.

అంతచలీ నాపై ఏ మాత్రం ప్రభావం చూపలేదు లోపల సరుకుంది గనుక. ఏం చెయ్యాలో తోచ డం లేదు. అతన్ని చూస్తే జాలేస్తోంది. అతనెవరో నాకు తెలియదు. కానీ ఆ పరిస్థితుల్లో అతన్ని అలాగే వదిలేసి వెళ్ళిపోవడం మానవత్వం అన్పించుకోదు.

అతనికి, నాకూ ఏ సంబంధమూ లేకున్నా మేమిద్దరమూ మనుషులమే ఈ ఒక్క సంబంధం చాలదూ... అతన్ని ఆదుకోవడానికి!?

ఓ పదిహేను నిముషాల నడక దూరంలో మున్సిపల్ ఆఫీస్ మెయిన్ సర్కిల్ ఉంది. అక్కడికి వెళ్తే ఏదైనా ఆటో దొరకవచ్చు. వర్షం పడుతూనే ఉంది. తడిస్తేనేం మొలకొస్తానా?

అందుకే సన్నటి పరుగులాంటి నడకతో బయలుదేరాను.

***

ఇరవై నాలుగు గంటలు సర్వీసు గల ఓ హాస్పిటల్ డాక్టర్ గదిలో నేను.

''మరేం పర్లేదండి. అతను నాలుగైదు రోజులుగా ఏ ఆహారమూ తీసుకోలేదు.

అందుకే నర్వస్‌తో నీరసించి పోయాడు. వాతావరణంలో కలుగుతున్న మార్పుల వల్ల ఇన్‌ఫెక్షన్ సోకి చలి జ్వరము వచ్చాయి. తగిన వైద్యం చేస్తే రెండు, మూడు రోజుల్లో కోలుకోగలదు. ఇంతకూ ఇతనికి మీరేమౌతారు? పేషెంటుతో పాటు ఎవరుంటారు?'' స్టెతస్కోపు మెడ నుండి తీసి టేబుల్ పై పెడ్తూ అడిగాడు డాక్టర్. ఎవరూ లేని అతనితో పాటు ఎవరుంటారని చెప్పాలి?

ఓ చిన్న అబద్ధమే ఒక్కోసారి పెద్ద ప్రమాదంలోనికి నెడుతుంది. అందుకే ఏదీ దాయకుండా ఉన్నది ఉన్నట్టు, జరిగింది జరిగినట్టు చెప్పాను డాక్టరుకి.

''అలాగా! మంచి పని చేశారు. మీలాంటి వారు ఈ కాలంలో చాలా అరుదుగా ఉంటారు. సరే పేషెంట్ విషయం మేం చూసుకుంటాం. మరి అతని ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చులు బెడ్ చార్జీలు ఎవరు భరిస్తారు?

నేనే మాత్రమూ ఆలోచించదలుచుకోలేదు. ఉన్న ఫళాన నా పర్సులో నుండి ఓ అయిదు వేల రూపాయలు తీసి అతని చేతిలో ఉంచుతూ.

''ఇవి ఉంచండి, సరిపోకపోతే ఎంత ఖర్చు అయినా నేను భరిస్తాను. ఇది నా పర్సనల్ కార్డు. నా ఫోన్ నెంబరు అడ్రస్సు దానిలో ఉన్నాయి. ఏ అవసరం వచ్చినా నాకు ఫోన్ చెయ్యండి. కానీ ఆ పెద్దాయనను మాత్రం బ్రతికించండి ప్లీజ్'' అంటూ లేచాను. ఆ క్షణంలో డాక్టరు గారి కళ్ళు నన్ను అభినందించడం గమనించక పోలేదు.

***

మరుసటి రోజు పనుల వత్తిడి వల్ల ఆ పెద్దాయన్ను చూడడానికి వెళ్ళలేక పోయాను. 'అదే నీ కుటుంబ సభ్యులైతే ఎంత పనున్నా వెళ్ళి చూసేవాడివే కదా! అవున్లే ఎంతయినా అతను పరాయి వాడేగా! డబ్బిచ్చి చేతులు దులుపుకుంటే సరా?'' అని నా మనసు ఒక పక్క ప్రశ్నిస్తూనే ఉంది. హాస్పిటల్‌కు ఫోన్‌చేసి అతని పరిస్థితి గురించి వాకబు చేసాను. పర్వాలేదు నెమ్మదిగా కోలుకుంటున్నాడని చెప్పారు. కాస్త మనసుకు ప్రశాంతత చేకూరింది.

రెండ్రోజుల తర్వాత!


ఓ వెయ్యి రూపాయలు తిరిగిస్తూ మిగతా 4 వేలకు బిల్లులు చేతుల్లో పెట్టాడు డాక్టర్.

'ఆ పెద్దాయనకు ఎలా ఉంది?' బిల్లులు సరిగా చూడకుండా జేబులో పెట్టుకుంటూ అడిగాను.

'ఆయన గంట క్రితమే వెళ్ళిపోయారు. వారానికి సరిపడా మందులు కూడా ఇచ్చి పంపాం. ఆ సమయంలో మీకు ఫోనూ చేసాం, నెట్‌వర్క్ ప్రాబ్లం అనుకుంటాను. మీసెల్ రెస్పాండ్ కాలేదు''.

ఛ.. ఎంత పొరపాటు జరిగిపోయింది. ఓ గంట ముందే వచ్చి ఉన్నట్లయితే కలిసి మాట్లాడే అవకాశం ఉండేది. కాలం ఎంత విలువైందో?

''మరి ఈ మిగిలిన వెయ్యి రూపాయలు అతనికే



ఇవ్వాల్సింది కదా డాక్టర్?''

''అతను తీసుకోలేదు. ఆత్మాభిమానం కలవాడు. ఏ పరిస్థితుల్లో అలా తయారయ్యాడో మరి.. ఆ వెళ్తూ వెళ్తూ ఈ చీటి మీకివ్వమని ఇచ్చి వెళ్లాడు'' అంటూ నా చేతిలో ఓ చీటి పెట్టాడు.

విప్పి చూసి చదివాను.

''ఆ భగవంతుడు నిన్ను చల్లగా చూడుగాక!'' అని రాసుంది. ఆ ప్రయత్నంగానే నా కళ్ళు చెమర్చాయి. ఓ చిన్ని సాయానికి ఇంత పెద్ద దీవెనా? పండగలని, పబ్బాలని, ఆదివారాలని బార్లల్లో రెస్టారెంట్లలోతగలబెట్టే బదులు, ఇలాంటి ప్రాణం పోసే పనులు చేయడం ఎంత అదృష్టం. ఆ చిన్న సంఘటనే నాలో పెనుమార్పు తీసుకొచ్చింది. దాని ఫలితంగా 'స్నేహ!' అనే ఛారిటీ సంస్థను స్థాపించడం జరిగిపోయింది. అఫ్‌కోర్స్ అందులో నా మిత్రుల సహకారం మరువలేనిది! ఇప్పుడు మాలో ఎవరూ తాగుబోతులు, తిరుగుబోతులు తీరు.

ఉన్నదంతా స్వచ్ఛమైన మనసున్న మనుషులు అంతే!

–లక్ష్మీభారతిరెడ్డి